## మాయా రాజేశ్వరన్ ఓటమి

### ముంబై డబ్ల్యూటీఏ ఓపెన్

ముంబై: ముంబై డబ్ల్యూటీఏ ఓపెన్‌లో భారత యువ ప్లేయర్ మాయా రాజేశ్వరన్ పోరాటం ముగిసింది. శనివారం జరిగిన మహిళల సింగిల్స్ సెమీఫైనల్లో మాయా రాజేశ్వరన్ 3-6, 1-6తో జిల్ తిచ్‌మన్ చేతిలో ఓటమిపాలైంది. మనోజ్‌కుమార్ దగ్గర శిక్షణ పొందుతున్న రాజేశ్వరన్ వైల్డ్‌కార్డ్ ద్వారా టోర్నీలోకి ప్రవేశించింది. అసలు ఎలాంటి అంచనాలు లేకుం డా బరిలోకి దిగిన మాయా సెమీస్‌లో చుక్కెదురైంది. ప్రత్యర్థికి దీటైన పోటీనివ్వడంలో విఫలమైన ఈ 15 ఏండ్ల యువ ప్లేయర్ వరుస సెట్లలో ఓటమి చవిచూసింది. మరోవైపు మహిళల డబుల్స్‌లో ప్రార్థనా తాంబ్రె, అరియానె హర్టోనో జోడీ ఫైనల్లో తలపడనుంది.

## నాకౌట్‌కు గుకేశ్

హంబర్గ్(జర్మనీ): ఫ్రీస్టయిల్ గ్రాండ్‌స్లామ్ టూర్‌లో భారత యువ గ్రాండ్‌మాస్టర్ దొమ్మరాజు గుకేశ్ నాకౌట్ పోరుకు అర్హత సాధించాడు. మొత్తం తొమ్మిది రౌండ్ల పాటు సాగిన క్వాలిఫయర్స్‌లో గుకేశ్ ఏడు గేమ్‌లు డ్రా చేసుకోగా, రెండింటిలో ఓటమిపాలై ఎనిమిదో స్థానంలో నిలిచాడు. శనివారం నార్వే స్టార్ ప్లేయర్ మాగ్నస్ కార్ల్‌సన్‌తో జరిగిన గేమ్‌లో గుకేశ్ ఓటమిపాలయ్యాడు. కార్ల్‌సన్‌తో పోరులో పలుమార్లు గేమ్‌ను డ్రా చేసుకునేందుకు అవకాశమచ్చినా..గుకేశ్ సద్వినియోగం చేసుకోలేకపోయాడు. మొత్తంగా తొమ్మిది రౌండ్లలో గుకేశ్ 3.5పాయింట్లు ఖాతాలో వేసుకున్నాడు. రౌండ్‌రాబిన్ ర్యాపిడ్ ఫార్మాట్‌లో జరిగిన టోర్నీలో అలీరెజా ఫిరౌజా, జావోకిర్ సింద్రోవ్ 6.5 పాయింట్లతో టాప్‌లో నిలిచారు.



# సిరీస్ లక్ష్యంగా..

## నేడు భారత్, ఇంగ్లండ్ రెండో వన్డే

### పూర్తి ఫిట్‌నెస్‌తో కోహ్లీ బరిలోకి మ. 1.30 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో

*ప్రతిష్ఠాత్మక చాంపియన్స్ ట్రోఫీకి సన్నాహకంగా జరుగుతున్న ఇంగ్లండ్‌తో వన్డే సిరీస్‌లో కీలక పోరుకు రంగం సిద్ధమైంది. ఇప్పటికే 1-0 ఆధిక్యంలో ఉన్న టీమ్‌ఇండియా మరో మ్యాచ్ మిగిలుండగానే సిరీస్‌ను కైవసం చేసుకోనేందుకు తహతహలాడుతున్నది. మెగాటోర్నీ కోసం మెరుగైన కూర్పు కోసం ప్రయత్నిస్తున్న భారత్ అందుకు తగ్గట్లు మార్పులు, చేర్పులు చేస్తున్నది. స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ గాయం నుంచి పూర్తి తేరుకోగా, కెప్టెన్ రోహిత్ శర్మ ఫామ్‌పై ఆందోళన కల్గిస్తున్నది. విరాట్ రాకతో ఎవరు తమ స్థానాన్ని వదులుకోవాల్సి వస్తుందన్న దానిపై ఆసక్తి నెలకొనగా, ఫామ్‌లేమి రోహిత్ భవితవ్యంపై ప్రభావం చూపే అవకాశముంది. మరోవైపు టీ20 సిరీస్ ఓటమి ఎదుర్కొన్న ఇంగ్లండ్ ఇప్పుడు చావోరేవో లాంటి పరిస్థితి ఎదుర్కొంటున్నది. సిరీస్‌లో నిలువాలంటే తప్పక గెలువాల్సిన స్థితిలో ఉంది.*

కటక్: భారత్, ఇంగ్లండ్ మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో కీలక పోరుకు వేళయైంది. ఆదివారం ఇరు జట్ల మధ్య బారాబతి స్టేడియం వేదికగా రెండో వన్డే జరుగనుంది. నాగ్‌పూర్ వన్డేలో ఘన విజయంతో టీమ్‌ఇండియా జోష్‌మీదుంటే..కటక్‌లో గెలిచి సిరీస్‌లో నిలువాలని ఇంగ్లండ్ చూస్తున్నది. ఈ నేపథ్యంలో రెండు జట్ల మధ్య ఆసక్తికరపోరుకు ఆస్కారముంది. మోకాలి నొప్పితో తొలి వన్డేకు దూరమైన స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ పూర్తి ఫిట్‌నెస్ సాధించడం టీమ్ మేనేజ్‌మెంట్‌కు మంచి ఊరట లభించింది. శనివారం జరిగిన ఆప్షనల్ ప్రాక్టీస్ సెషనల్ కోహ్లీ ఎలాంటి ఇబ్బంది లేకుండా గడిపాడని బ్యాటింగ్ కోచ్ సితాంశు కోటక్ పేర్కొన్నాడు. మరోవైపు ఫార్మాట్‌తో సంబంధం లేకుండా కెప్టెన్ రోహిత్ ఫామ్ ఆందోళన కల్గిస్తున్నది. చాంపియన్స్ ట్రోఫీ ముందు హిట్‌మ్యాన్ టచ్‌లోకి వస్తే టీమ్‌ఇండియాకు తిరుగుండకపోవచ్చు. మరోవైపు టీ20 సిరీస్ ఓటమితో ఒత్తిడిలో ఉన్న ఇంగ్లండ్‌సిరీస్‌లో 0-1తో వెనుకంజలో ఉంది. ఆదివారం కటక్ వన్డేలో కూడా ఓడితే సిరీస్ చేజార్చుకున్నట్లే అవుతుంది. ఒక రకంగా కీలకమైన చాంపియన్స్ ట్రోఫీకి ముందు ఇంగ్లిష్ జట్టుకు ఇబ్బందిగా మారవచ్చు.

**కోహ్లీ రీఎంట్రీ:**

కటక్ వన్డే ద్వారా కోహ్లీ రీఎంట్రీ ఇవ్వబోతున్నాడు. దీంతో తుది జట్టు కూర్పులో మార్పులు, చేర్పులు చోటు చేసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. కోహ్లీ స్థానంలో తొలి వన్డేకు జట్టులోకి వచ్చిన శ్రేయాస్ అయ్యర్ అంచనాలకు మించి రాణించాడు. దీంతో అయ్యర్‌ను పక్కకు పెట్టే అవకాశాలు కనిపించడం లేదు. ఇంగ్లండ్ బౌలర్లను అలవోకగా ఎదుర్కొంటూ అయ్యర్ దూకుడుగా ఆడటం ఇన్నింగ్స్ స్వరూపాన్నే మార్చేసింది. నాగ్‌పూర్ మ్యాచ్ ద్వారా వన్డేలోకి అరంగేట్రం చేసిన యశస్వి జైస్వాల్‌ను తప్పించే అవకాశముంది. ఇది జరిగితే రోహిత్‌కు జతగా శుభ్‌మన్ గిల్ ఓపెనర్ వచ్చే చాన్స్ ఉంది. బౌలింగ్ యూనిట్‌లో పెద్దగా మార్పులేమి జరుగకపోవచ్చు. ఒకవేళ హర్షిత్‌రాణా స్థానంలో అర్షదీప్‌సింగ్ జట్టులోకి వచ్చే చాన్స్ ఉంది.

ఇంగ్లండ్‌కు చావోరేవో: సిరీస్‌లో నిలువాలంటే ఇంగ్లండ్ తప్పక గెలువాల్సిన పరిస్థితి ఎదుర్కొంటుంది. భారత స్పిన్నర్లను ఎదుర్కొవడంలో ఇంగ్లండ్ బ్యాటర్లు ఇంకా ఇబ్బందులు పడుతున్నారు. ఈ అడ్డంకిని అధిగమిస్తేనే ఇంగ్లండ్ నిలబుడుతుంది లేకపోతే సిరీస్ టీమ్ ఇండియాకు చేజార్చుకున్నట్లే.

**జట్ల అంచనా:**

**భారత్:** రోహిత్(కెప్టెన్), జైస్వాల్, గిల్, కోహ్లీ, రాహుల్/పంత్, హార్దిక్, జడేజా, అక్షర్, కుల్దీప్, రాణా/అర్షదీప్, షమీ.

**ఇంగ్లండ్:** డకెట్, సాల్ట్, రూట్, బ్రూక్, బట్లర్(కెప్టెన్), లివింగ్‌స్టోన్, బెతెల్, కార్స్, ఆర్చర్, రషీద్, వుడ్/సకీబ్.



### కోహ్లీ ఫిట్

టీమ్‌ఇండియా స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీ గాయం నుంచి పూర్తిగా కోలుకున్నాడు. మోకాలి గాయంతో ఇంగ్లండ్‌తో తొలి వన్డేకు దూరమైన విరాట్..ఆదివారం జరిగే రెండో వన్డేలో ఆడనున్నాడు. ఈ విషయాన్ని జట్టు బ్యాటింగ్ కోచ్ సితాంశు కోటక్ శనివారం మీడియా సమావేశంలో వెల్లడించాడు. 'విరాట్ కోహ్లీ పూర్తి ఫిట్‌నెస్ సాధించాడు. రెండో వన్డేకు సన్నాహకంగా జరిగిన ప్రాక్టీస్ సెషన్‌లో పాల్గొన్నాడు.

## నిత్యకు రజతం

### 38వ నేషనల్ గేమ్స్



డెహ్రాడూన్: ఉత్తరాఖండ్ వేదికగా జరుగుతున్న 38వ నేషనల్ గేమ్స్‌లో తెలంగాణ ప్లేయర్లు పతకాల వేట కొనసాగిస్తున్నారు. శనివారం జరిగిన మహిళల 100మీటర్ల రేసును రాష్ట్ర యువ అథ్లెట్ నిత్య గాదె 11.79 సెకన్లలో ముగించి రజత పతకంతో మెరిసింది. ఆద్యంతం ఆసక్తికరంగా సాగిన రేసులో సుదేశ్న శివశంకర్(11.76సె, మహారాష్ట్ర), గిరిధారిని(11.88సె, తమిళనాడు) వరుసగా స్వర్ణ, కాంస్య పతకాలు సొంతం చేసుకున్నారు. మరోవైపు మహిళల నెట్‌బాల్ ఈవెంట్‌లో తెలంగాణ సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. హోరాహోరీగా సాగిన క్వార్టర్స్‌లో తెలంగాణ 49-46 తేడాతో చండీగఢ్‌పై అద్భుత విజయం సాధించింది.

## నాయర్ సెంచరీ

### విదర్భ తొలి ఇన్నింగ్స్ 264/6



నాగ్‌పూర్: దేశవాళీల్లో విదర్భ స్టార్ బ్యాటర్ కరణ్‌నాయర్ పరుగుల వరద దిగ్విజయంగా కొనసాగుతున్నది. తన కెరీర్‌లో అద్భుత ఫామ్ కనబరుస్తున్న నాయర్ శనివారం తమిళనాడుతో మొదలైన క్వార్టర్స్ పోరులో నాయర్(180 బంతుల్లో 100 నాటౌట్, 14ఫోర్లు, సిక్స్) అజేయ సెంచరీతో కదంతొక్కాడు. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్‌కు దిగిన విదర్భ ఆదిలోనే ఎదురుదెబ్బ తగిలింది. విజయ్ శంకర్(2/50) ధాటికి విదర్భ 44 పరుగులకే 3 వికెట్లు కోల్పోయింది. ఓపెనర్ అథర్వ తద్దె(0) డకౌట్ కాగా, ఆదిత్య తకారె(5), ధృవ్ షోరె(26) విఫలమయ్యారు. ఈ తరుణంలో దనీశ్ మలెవార్(75), కరణ్ నాయర్ ఇన్నింగ్స్‌ను చక్కదిద్దారు. ముఖ్యంగా ఈ సీజన్‌లో జట్టు బ్యాటింగ్ భారాన్ని మోస్తున్న నాయర్ తన ఇన్నింగ్స్‌లో 14ఫోర్లు, సిక్స్‌తో అలరించాడు. గాడిలో పడిందనుకున్న తరుణంలో మలెవార్ ఔట్ కావడంతో నాలుగో వికెట్‌కు 98 పరుగుల భాగస్వామ్యానికి బ్రేక్ పడింది. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన అక్షయ్ వాడ్కర్(24)తో కలిసి నాయర్ ఇన్నింగ్ బాధ్యత తీసుకున్నాడు. సోనూ యాదవ్, మహమ్మద్, అజిత్‌రామ్, అలీ ఒక్కో వికెట్ తీశారు.

**ఆదుకున్న ములానీ, తనుశ్:**

ముంబై, హర్యానా రంజీ క్వార్టర్స్ పోరు రసవత్తరంగా సాగుతున్నది. అన్షుల్ కాంబోజ్(3/58), సుమిత్‌కుమార్(2/57) ధాటికి 65 పరుగులకే 5 వికెట్లు కోల్పోయిన ముంబైని శామ్స్ ములానీ(91), తనుశ్ కొటియాన్(85 నాటౌట్) ఆదుకున్నారు.

## భారత్ పతక జోరు

### ఆసియా రోడ్ పారా సైక్లింగ్ చాంపియన్‌షిప్



హైదరాబాద్, ఆట ప్రతినిధి: థాయ్‌లాండ్‌లోని ఫిచిట్ నగరం వేదికగా జరుగుతున్న ఆసియా రోడ్ పారా సైక్లింగ్ చాంపియన్‌షిప్‌లో భారత పారాసైక్లిస్టుల పతక జోరు దిగ్విజయంగా కొనసాగుతున్నది. పోటీలకు రెండో రోజైన శనివారం భారత్‌కు స్వర్ణం సహ రెండు రజతాలు, కాంస్యం దక్కాయి. మహిళ సీ2 రోడ్ రేసు ఈవెంట్‌లో మహారాష్ట్రకు చెందిన జ్యోతి గదేరియా పసిడి పతకంతో మెరిసింది. మరోవైపు పురుషుల హెచ్4 హ్యాండ్ సైక్లింగ్ ఈవెంట్‌లో ప్రశాంత్ అర్కల్(మహారాష్ట్ర) రజతం దక్కించుకున్నాడు. పురుషుల సీ2 రోడ్ రేసు ఈవెంట్‌లో అర్షద్ షేక్(ఆంధ్రప్రదేశ్)కు రజతం, పురుషుల సీ2 ఈవెంట్‌లో జలాలుద్దీన్ అంసారీ(బీహార్) కాంస్యం ఖాతాలో వేసుకున్నాడు. కృషి, పట్టుదలతో పారా సైక్లిస్టులు సాధిస్తున్న విజయాలు ఎందరికో స్ఫూర్తి దాయకమని ఆదిత్య మెహతా ఫౌండేషన్ పేర్కొంది. లాస్‌ఏంజిల్(2028) పారా ఒలింపిక్స్ లక్ష్యంగా అథ్లెట్లు తమ సాధన కొనసాగిస్తున్నారని తెలిపింది.

## త్వరలో టీపీఎల్

- ప్రతీ జిల్లాకు కోటి రూపాయల ఫండ్
- హెచ్‌సీఏ అపెక్స్ కౌన్సిల్‌లో నిర్ణయాలు



హైదరాబాద్, ఆట ప్రతినిధి: ప్రతిభ కల్గిన యువ కల్గిన యువ క్రికెటర్లను ప్రోత్సహించేందుకు తెలంగాణ ప్రీమియర్ లీగ్(టీపీఎల్)ను త్వరలో నిర్వహిస్తామని హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ) అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు పేర్కొన్నారు. శనివారం ఉప్పల్ స్టేడియంలో జరిగిన అపెక్స్ కౌన్సిల్‌లో జరిగిన సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను ఆయన మీడియాకు వెల్లడించారు. చాంపియన్స్ ట్రోఫీకి టీమ్‌ఇండియా మేనేజర్‌గా ఎంపికైన కార్యదర్శి దేవరాజ్‌ను తొలుత సభ్యులందరూ అభినందించారు. 'ఐపీఎల్ తర్వాత యువ క్రికెటర్ల కోసం టీపీఎల్ ఏర్పాట్లకు పనులు ప్రారంభిస్తాం. ఉమ్మడి జిల్లాల ప్రాతిపాదికన ప్రతీ జిల్లాకు క్రికెట్ అభివృద్ధికి కోటి ఖర్చు చేస్తాం. కొత్త స్టేడియాల నిర్మాణం కోసం పదెకరాలు సేకరిస్తాం. దేశవాళీ, అంతర్జాతీయ స్థాయిలో మెరిసిన క్రికెటర్లను సత్కరించేందుకు మార్చిలో హెచ్‌సీఏ అవార్డుల కార్యక్రమం చేస్తాం. బీసీసీఐ నిబంధనలకు అనుగుణంగా ఉప్పల్ స్టేడియం ఆధునీకరిస్తాం. ఐపీఎల్ మ్యాచ్‌ల నిర్వహణకు త్వరలో టెండర్లు పిలుస్తాం' అని అన్నారు.

## పట్టుబిగించిన ఆసీస్

### శ్రీలంకతో రెండో టెస్టు




గాలె(శ్రీలంక): శ్రీలంకతో జరుగుతున్న రెండో టెస్టుపై పర్యాటక ఆస్ట్రేలియా పట్టు బిగించింది. కుహెమన్(4/52), లియాన్(3/80) ధాటికి లంక రెండో ఇన్నింగ్స్‌లో 8 వికెట్లకు 211 స్కోరు చేసింది. పిచ్ పరిస్థితులను సద్వినియోగం చేసుకుంటూ ఆసీస్ బౌలర్లు వికెట్ల వేట కొనసాగించారు. మాథ్యూస్(76) అర్ధసెంచరీతో ఆకట్టుకోగా, మిగతావారు ఘోరంగా విఫలమయ్యారు. చేతిలో రెండు వికెట్లు ఉన్న లంక ప్రస్తుతం 54 ఆధిక్యంలో కొనసాగుతున్నది. ఓవర్‌నైట్ స్కోరు 330/3 శనివారం మూడో రోజు తొలి ఇన్నింగ్స్‌కు దిగిన ఆసీస్ 414 పరుగులకు ఆలౌటైంది. ఓవర్‌నైట్ బ్యాటర్లు అలెక్స్ క్యారీ(156), కెప్టెన్ స్మిత్(131) దూకుడు కనబరిచారు. ప్రభాత్ జయసూర్య(5/151) ఐదు వికెట్లతో అదరగొట్టగా, నిశాన్ పెరిస్(3/94) ఆకట్టుకున్నారు.

## రూపాయిని నిర్ణయించేవి మార్కెట్ శక్తులే

- ఆర్బీఐ గవర్నర్ మల్హోత్రా వెల్లడి




*శనివారం 613వ సెంట్రల్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ల సమావేశంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, సహాయ మంత్రి పంకజ్ చౌదరి, రిజర్వు బ్యాంక్ గవర్నర్ సంజయ్ మల్హోత్రా*

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8: దేశీయ కరెన్సీ రూపాయి విలువ పతనం చెందడంపై రిజర్వు బ్యాంక్ గవర్నర్ సంజయ్ మల్హోత్రా స్పందించారు. డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువను మార్కెట్ శక్తులే నిర్ణయిస్తాయని పేర్కొన్నారు. మారకం విలువ రోజువారీగా పతనం చెందడంపై సెంట్రల్ బ్యాంక్ పెద్దగా ఆందోళన చెందబోదని, దీర్ఘకాలిక విలువ మార్పుపైనే దృష్టి సారించనున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో ప్రత్యేకంగా భేటీ అయిన అనంతరం ఆయన విలేకరులతో ఈ విషయాన్ని చెప్పారు. డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ 87.50కి పడిపోయిన విషయం తెలిసిందే. రూపాయి విషయంలో ఆర్బీఐ వైఖరిలో ఎలాంటి మార్పు లేదు..విలువ స్థాయిని గానీ, ఒక బ్యాండ్‌ను గానీ మేం చూడబోం ..ఎప్పుడైన భారీ స్థాయిలో ఒడిదుడుకులు ఎదురైతే జోక్యం చేసుకుంటామని చెప్పారు. రోజువారీ విలువ తగ్గడం, పెరగడం సర్వ సాధారణంగా జరుగుతుంటాయి..వీటిని పెద్దగా పట్టించుకోబోమని ఆయన స్పష్టంచేశారు. కరెన్సీ విలువ 5 శాతం క్షీణిస్తే దేశీయ ద్రవ్యోల్బణం 30-35 బేసిస్ పాయింట్లు మేర ప్రభావం చూపనున్నదని చెప్పారు. వచ్చే ఆర్థిక సంవత్సరానికిగాను వృద్ధి, ద్రవ్యోల్బణ అంచనాలను రూపీ-డాలర్ విలువ ఆధారంగానే లెక్కకట్టినట్లు చెప్పారు.

**అంతర్జాతీయ పరిణామాల వల్లనే**

అంతర్జాతీయ పరిణామాల వల్లనే కరెన్సీ పడిపోతున్నది తప్ప దేశీయ పరిస్థితుల కారణంగా రూపాయి పతనం చెందడం లేదని మల్హోత్రా వ్యాఖ్యానించారు. ముఖ్యంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పలు దేశాలపై సుంకాల విధిస్తుండటం ఇందుకు ప్రధాన కారణమన్నారు. త్వరలో దీనికి పరిష్కారం లభిస్తుందని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు. రోజుకొక కనిష్ఠ స్థాయికి పడిపోతున్న రూపాయి విలువ శుక్రవారం స్వల్పంగా పెరిగింది. ఐదేండ్ల తర్వాత రిజర్వుబ్యాంక్ కీలక వడ్డీ రేట్లను పావు శాతం తగ్గించడంతో రూపీ విలువ 9 పైసలు పెరిగి 87.50 వద్ద స్థిరపడింది. బ్యాంకింగ్ వ్యవస్థలో నిధుల లభ్యతపై వస్తున్న ఆందోళనపై ఆయన స్పందిస్తూ..బ్యాంకింగ్ వ్యవస్థలో నిధులను పెంచడానికి తమ వద్ద ఎన్నో అస్త్రాలువున్నాయని, అవసరమైనప్పుడు వాటిని వినియోగిస్తామని చెప్పారు. క్రిప్టో కరెన్సీపై ఆయన స్పందిస్తూ..ప్రస్తుతం ఈ అదృశ్య కరెన్సీపై ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకుంటున్నదని, ఇందుకు సంబంధించి త్వరలో ఒక గ్రూపును ఏర్పాటు చేసే అవకాశం కూడా ఉన్నదన్నారు. ఈ సమావేశానికి ఆర్బీఐ డిప్యూటీ గవర్నర్లు రాజేశ్వర్ రావు, రవి శంకర్, స్వామినాథన్‌తోపాటు ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి అజయ్ సేథ్, ఆర్థిక సేవల కార్యదర్శి నాగరాజు కూడా పాల్గొన్నారు.

### వచ్చేవారంలో ఐటీ బిల్లు: సీతారామన్

వచ్చేవారంలో పార్లమెంట్ సమావేశాల్లోనే నూతన ఆదాయ పన్ను బిల్లును ప్రవేశపెట్టే అవకాశాలున్నాయని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టంచేశారు. ఆరు దశాబ్దాల క్రితం రూపొందించిన ఐటీ బిల్లు స్థానంలో నూతన బిల్లును ప్రవేశపెట్టడానికి ఇప్పటికే కసరత్తు పూర్తైందని మంత్రి చెప్పారు. లోకసభలో ప్రవేశపెట్టిన అనంతరం ఈ బిల్లును పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీకి పంపించడం జరుగుతున్నదని, ఈ బిల్లుకు ఇప్పటికే కేంద్ర క్యాబినెట్ ఆమోదం లభించిందన్నారు.

## రైతుబంధు కోసం రోడ్డెక్కిన రైతు

- యాసంగి పంటకు అందని పెట్టుబడి సాయం
- ఆగ్రహంతో జాతీయ రహదారిపై బారికెడ్స్ పెట్టేందుకు ప్రయత్నించిన బాధిత రైతు

కొల్లాపూర్, ఫిబ్రవరి 8 : సీఎం ఇలాకాలో టకి టకీమని రైతు భరోసా డబ్బులు పడాతాయని ఎదురు చూసి సహనం కోల్పోయిన ఓ రైతు జాతీయ రహదారి (167కే)పై బారికెడ్స్ పెట్టి నిరసన తెలి పేందుకు ప్రయత్నించిన ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలకేంద్రంలో శనివారం సాయంత్రం చోటుచేసుకున్నది. పెద్దకొత్తపల్లి మండలం ముష్టిపల్లి గ్రామానికి చెందిన బండమీది జగపతికి ఎకరన్నరం (1.5)భూమి ఉన్నది. ఈ భూమి మీదనే రైతు జగపతి కుటుంబం జీవనాన్ని సాగిస్తున్నది. రైతు జగపతికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉండగా ఒక కు మార్తెకు వివాహం అయింది. కుటుంబ పోషణకు వ్యవసాయం తప్పా మరో ఆధారం లేదు. వానకాలం పంటకు కూడా ప్రభుత్వం ఇచ్చే పంట పెట్టుపడి సాయం (రైతుభరోసా) ఇవ్వకపోవడంతో దళారుల వద్ద అప్పు తెచ్చి పంటలు సాగు చేశాడు. యాసంగి పంటకు సైతం పెట్టుబడి సాయం కోసం దళారుల చుట్టూ కాళ్లు అరిగేలా తిరిగినా అప్పు పుట్టలేదు. దీంతో సదరు రైతు పెద్దకొత్తపల్లి మండల కేంద్రంలోని గ్రామీణ వికాస బ్యాంకులో రైతు భరోసా డబ్బులు పడ్డాయో లేదో చూడమని బ్యాంక్ అధికారులను వేడుకున్నాడు. రైతు భరోసా డబ్బులు లేవు గిరోసా డబ్బులు లేవని చెప్పడంతో ఉదయం నుంచి కడుపు కట్టుకొని తిండి తిప్పలు లేకుండా బ్యాంకులు చుట్టూ దళారుల చుట్టూ అప్పుల కోసం తిరిగినా లాభం లేదని మనోవేదనకు గురుయ్యాడు. ఎకరాకు రూ.ఆరు వేలు వేస్తామన్న రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా వేయకుండా మోసం చేసిందని ఆగ్రహంతో జాతీయ రహదారిపైకి వచ్చి బారికెడ్స్ పెట్టి నిరసన తెలిపేందుకు ప్రయత్నించాడు. దీంతో ఆర్టీసీ సిబ్బంది బాధిత రైతును నెట్టి వేయడంతో కొద్దిసేపు ఉద్రిక్తత చోటు చేసుకుంది. రైతులకు డబ్బులు వేయకుండా రైతుల ఉసురు తీస్తున్న ప్రభుత్వంపై బాధిత రైతు శాపనార్థాలు పెడుతూ నిరసన వ్యక్తం చేశాడు.



జాతీయ రహదారిపై నిరసన తెలుపుతున్న రైతు

## అందుబాటులోకి 12 ఎంఎస్ఎంఈ పార్కులు

- బీఆర్ఎస్ సర్కారు హయాంలో అభివృద్ధి
- ప్లాట్ల కేటాయింపు ప్రారంభించిన టీజీఐఐసీ

హైదరాబాద్, ఫిబ్రవరి 8 (నమస్తే తెలంగాణ): పారిశ్రామిక ప్రగతికి కేసీఆర్ వేసిన బాటలు అద్భుతమైన ఫలితాలనిస్తున్నాయి. పారిశ్రామిక రంగం అభివృద్ధికి బీఆర్ఎస్ హయాంలో వేసిన బలమైన పునాదులతో నేడు రాష్ట్రానికి పెట్టుబడిదారులు క్యూ కడుతున్నారు. సూక్ష్మ,చిన్న, మధ్య తరహా పరిశ్రములు(ఎంఎస్ఎంఈ) మొదలుకొని భారీ పరిశ్రమల వరకు తెలంగాణ రాష్ట్రాన్ని తమ గమ్యస్థానంగా చూస్తున్నాయి. ఈ క్రమంలోనే కేసీఆర్ పాలనలో అభివృద్ధి చేసిన 12ఎంఎస్ఎం పార్కులు ప్రస్తుతం అందుబాటులోకొచ్చాయి. దీంతో టీజీఐఐసీ అర్హతగల ఎంఎస్ఎంఈలకు భూ కేటాయింపులు కూడా ప్రారంభించింది. ఉమ్మడి రాష్ట్రంలో తీవ్ర అన్యాయానికి గురైన తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో కేసీఆర్ ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. ముఖ్యంగా పారిశ్రామికరంగ అభివృద్ధిలో భాగంగా నిరంతర విద్యుత్ సరఫరాను అందించడంతోపాటు పెద్ద ఎత్తున పారిశ్రామికవాడలను అభివృద్ధి చేశారు. తొమ్మిదిన్నరేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రవ్యాప్తంగా పరిశ్రమల కోసం 1.5 లక్షల ఎకరాల ల్యాండ్‌బ్యాంక్‌ను సిద్ధంచేసి దాదాపు 28,458 ఎకరాల భూములను పరిశ్రమలకు కేటాయించారు. వివిధ జిల్లాల్లో 156 కొత్త పారిశ్రామికవాడలను అభివృద్ధి చేశారు కూడా. సైబరాబాద్, మేడ్చల్-సిద్దిపేట, కరీంనగర్, నిజామాబాద్, యాదాద్రి, ఖమ్మం, వరంగల్ తదితర ప్రాంతాల్లో టీజీఐఐసీ జోనల్ కార్యాలయాలను నెలకొల్పి జిల్లాల వారీగా పరిశ్రమల ఏర్పాటునకు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. తొమ్మిదిన్నరేళ్లలో దాదాపు 21,921 యూనిట్లకు అనుమతులు జారీచేయగా, రూ. 2.66 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. అలాగే, దాదాపు 18లక్షల ఉద్యోగ అవకాశాలు లభించాయి. ఈ క్రమంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన 12 ఎంఎస్ఎంఈ పారిశ్రామికవాడలు అందుబాటులోకి వచ్చాయి.

## ఆయిల్ ఇండియా ప్రాఫిట్ డౌన్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8: ప్రభుత్వరంగ ఇంధన సంస్థ ఆయిల్ ఇండియా లిమిటెడ్(ఓఐఎల్) నిరాశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికపు లాభంలో 23 శాతం తగ్గింది. ఇంధన ధరలు తగ్గుముఖం పట్టడం వల్లనే లాభాలు తగ్గాయని పేర్కొంది. అక్టోబర్-డిసెంబర్ 2024 త్రైమాసికానికిగాను రూ.1,221.80 కోట్ల లాభాన్ని గడించింది. కంపెనీ ఆదాయం కూడా రూ.5,815.02 కోట్ల నుంచి రూ.5,239.66 కోట్లకు తగ్గింది. మరోవైపు, ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికిగాను రూ.10 ముఖ విలువ కలిగిన ప్రతిషేరుకు రూ.7 మధ్యంతర డివిడెండ్‌ను ప్రకటించింది.

## ఫోర్బ్స్30 అండర్ 30లో నీలకంఠ భాను

హైదరాబాద్, ఫిబ్రవరి 8: ప్రపంచంలో అత్యంత వేగవంతమైన కాలుక్యులేటర్‌ను తయారు చేసిన హైదరాబాద్‌కు చెందిన నీలకంఠ భానుకు మరోసారి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. ప్రముఖ మ్యాగైజన్ ఫోర్బ్స్ విడుదల చేసిన 30 ఏండ్లలోపు 30 మంది జాబితాలో ఆయనకు చోటు లభించినట్లు ప్రకటించింది. ఈ ఫోర్బ్స్ జాబితాలో భాంజు ఫౌండర్స్ నీలకంఠ భాను, అల్లూరి ఉదయ్ కిరణ్, జొన్నలగడ్డ సాయి కృష్ణకాంత్‌లకు చోటు దక్కింది. ఈ జాబితాలో భానుకు చోటు దక్కడం ఇది రెండోసారి కావడం విశేషం.

## భెల్‌కు 8 వేల కోట్ల ఆర్డర్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8: భెల్ మరో భారీ ఆర్డర్‌ను చేజిక్కించుకున్నది. మహాజెన్కో నుంచి రూ.8 వేల కోట్ల విలువైన ఆర్డర్ లభించినట్లు పేర్కొంది. ఈ ఆర్డర్‌లో భాగంగా కోరాడి థర్మల్ పవర్ స్టేషన్‌లో నిర్మించతలపెట్టిన 1320 మెగావాట్ల బీటీజీ(బాయిలర్ టర్బైన్ జనరేటర్) ప్లాంట్‌ను నిర్మించడంతోపాటు పరికరాలు, సివిల్ వర్క్స్ కూడా చేయాల్సి ఉంటుందని పేర్కొంది.

## ఏడుకొండల వాడా.. ఏమిటీ గోస.!

- మన్యంకొండ రోప్‌వే డిజైన్ ఆగస్టు 2023లోనే ఖరారు
- ఏడాదికి పైనే గడుస్తున్నా.. పట్టించుకోని ప్రజాపాలన ప్రభుత్వం
- పర్యాటకులు, భక్తులకు తప్పని తిప్పలు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ, ఫిబ్రవరి 8 : తెలంగాణ పేదల తిరుపతిగా పిలిచే ప్రముఖ పుణ్యక్షేత్రం..ఉమ్మడి పాలమూరు జిల్లాకే తలమానికంగా ఉన్న మన్యంకొండ ఆలయానికి అంతర్జాతీయ స్థాయిలో మొదటి రోప్‌వే సౌకర్యం కల్పించే నమూనాలను ఆగస్టు 2023లోనే అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఆమోదించినా.. నేటి ప్రజాపాలన ప్రభుత్వం ఆ దిశగా ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. పర్యాటకులు, భక్తులకు ప్రయాణం సులభతరం చేయాలనే సంకల్పంతో రాష్ట్రంలోనే ఆలయాల వద్ద నిర్మించే మొట్టమొదటి రోప్‌వేను బీఆర్ఎస్ ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నది. విదేశాల్లో ఉన్న కేబుల్‌కార్ కంటే మన రోప్‌వే మరింత అద్భుతంగా ఉండేలా నమూనాలను పరిశీలించి తుదిరూపు ఇచ్చారు. మన్యంకొండ రోప్‌వేకు అనుసంధానంగా కొండమీద ల్యాండింగ్, ల్యాండ్ స్కేపింగ్, స్కైవాక్ డిజైన్లను ఆమోదించారు. ఎన్నికల అనంతరం కాంగ్రెస్ ప్రజాపాలన ప్రభుత్వం కొలువుదీరింది. దీంతో 'మన్యంకొండ రోప్‌వే' ఆటకెక్కింది.

**పర్యాటకులను ఆకర్షించడమే లక్ష్యంగా ..**

స్విట్జర్లాండ్, దక్షిణ కొరియాలో ఉన్న రోప్‌వే కంటే అద్భుతంగా ఉండేలా, దేశీయ పర్యాటకులతో పాటు విదేశీ పర్యాటకులను కూడా ఆకర్షించడమే లక్ష్యంగా మన్యంకొండ వద్ద చేపట్టే రోప్‌వే నిర్మాణానికి అప్పటి రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో ప్రణాళికలు రూపొందించా రు. కొండపైన కేబుల్ కార్ ద్వారా వెళ్లిన భక్తులు నేరుగా దైవదర్శనానికి వెళ్లేందుకు ఇబ్బంది లేకుండా.. నేరుగా గుడిలోకి వెళ్లేందుకు స్కైవాక్ నిర్మాణం ఉంటుందని, అక్కడి నుంచి స్వామిని దర్శించుకోవచ్చని అప్పట్లో రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి, అధికారులు అధికారులు ప్రకటించారు.

**అధునాతన సౌకర్యాలు, ప్రత్యేకతలు :** కొండపైన అన్నదాన సత్రం, లడ్డూ కౌంటర్, కోనేరు నిర్మాణాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు ఆగస్టు 2023లో ప్రణాళికలు రూపొందించారు. పర్యాటకులు, భక్తులు కొండపైన దిగగానే ల్యాండ్ స్కేపింగ్ అత్యద్భుతంగా కళ్లకు కట్టేలా తీర్చిదిద్దడంతో పాటు రోప్‌వే స్టేషన్ వద్ద రెస్టారెంట్, విశాలమైన పార్కింగ్ ఏరియాలను సైతం ప్రతిపాదించారు. కొండ దిగువ నుంచి కొండపైకి సుమారు కిలోమీటరు మేర నిర్మించనున్న ఈ రోప్‌వే వల్ల పర్యాటకులు, భక్తుల ప్రయాణ కష్టాలు తీరడంతో పాటు భక్తుల సంఖ్య మరింత పెరుగుతుందని భావించారు. కొండ దిగువన పర్యాటకుల సౌకర్యం కోసం హరిత హోటల్ నిర్మాణానికి ఆమోదించినా.. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఒక్క అడుగు ముందుకు పడటం లేదు. ఏడాదికి పైగా ఎటువటి పురోగతి లేక పోవడంపై భక్తులు, పర్యాటకులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. వెంటనే రోప్‌వే నిర్మాణంపై దృష్టి సారించాలని కోరుతున్నారు.




మహబూబ్‌నగర్ జిల్లా మన్యంకొండ వద్ద చేపట్టే రోప్‌వే నిర్మాణానికి సంబంధించిన నమూనా చిత్రాలు